క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన వెంకటేష్

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి గ్రామం వద్దనున్న మోడల్ స్కూల్ ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి వెంకటేష్ రాష్ట్ర స్థాయి పరుగు పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రాముడు గురువారం తెలిపారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు రాజమండ్రిలో జూనియర్ నేషనల్ సెలక్షన్‌లో వెయ్యి మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. ఈ నెల 19,20 తేదీల్లో గుంటూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వెంకటేష్ పాల్గొంటాడని చెప్పారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ షమీల, అధ్యాపకులు అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పౌర్ణమి పూజలు



స్వామి వారి నిజరూపదర్శనం

మద్దికెర : మండల కేంద్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గురువారం పౌర్ణమిని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారు నిజరూప దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు.భక్తులకు అన్నదానం చేశారు.

ఎల్లమ్మకు వెండి ఆభరణం వితరణ



వెండి ఆభరణాన్ని అందిస్తున్న దాతలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆనకల సుజాత, రమేష్ దంపతులు శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి గురువారం 55 తులాల వెండి ఆభరణాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ మొక్కు చెల్లింపులో భాగంగా అమ్మవారికి ఆభరణాన్ని చేయించి ఇచ్చామని తెలిపారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దాతలకు అమ్మవారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.

మద్యం దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటిస్తాం



ఎక్సైజ్ సీఐ మంజులకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): బడులు, గుడులు ఉన్న ప్రాంతాలతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలిగే ప్రాంతాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తామని కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజులు తెలిపారు. గురువారం ఆమె వెల్దుర్తిలోని మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. ఓ దుకాణం గుడికి, బడికి సమీపంలో ఏర్పాటు చేస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ ఆమెకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. అలాంటి స్థలాల్లో దుకాణానికి అనుమతులు ఇవ్వమని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకే అనుమతులు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంధోత్సవం



వెల్దుర్తిలో గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లుతున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని రెండవ వార్డులో వెలసిన పెద్ద దస్తగిరయ్య స్వామి ఉరుసులో భాగంగా గురువారం స్వామికి దర్గా పీఠాధిపతి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో గంధం ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. శుక్రవారం ఉరుసు జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: ఈనెల 23వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించే రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రథమ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం కైరుప్పల గ్రామంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సదస్సులో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలపై నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. ఉరుకుందు, అశోక్, మల్లి, వీరేష్ పాల్గొన్నారు.

- నూతన మద్యం పాలసీ ఎఫెక్ట్
- ఉపాధి కోల్పోయిన 48 మంది సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు
- వైఎస్సార్‌సీపీ హయాంలో నిరుద్యోగులకు ఉపాధి
- కూటమి ప్రభుత్వం రాకతో వారి జీవనానికి ఎసరు

వీధిన పడేశారు!



ఉద్యోగాలు కోల్పోయిన ఆలూరు మద్యం షాపుల్లో పనిచేసిన సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ కొందరు కార్మికుల పొట్టకొట్టింది. మద్యం దుకాణాలల్లో సూపర్‌వైజర్లు సేల్స్‌మ్యాన్‌లుగా పనిచేస్తున్న వారికి ఉపాధిని దూరం చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు,సేల్స్‌మ్యాన్‌లుగా అవకాశం కల్పించింది. దీంతో వారు ఉద్యోగాల్లో చేరి కుటుంబాలు పోషించుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వారిని తొలగిస్తామనే బెదిరింపులతో నిత్యం ఆందోళనలతో గడిపారు. ఇటీవల దుకాణాల కేటాయింపుతో వారు ఉపాధిని కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ప్రభుత్వం ఇలా గెంటేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తమకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

12 దుకాణాల్లో..48 మందికి ఉపాధి..

ఆలూరు నియోజకవర్గంలో గతంలో 12 మద్యం షాపులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అవినీతికి తావులేకుండా ఉండేందుకు సర్కారీ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసింది. అక్కడ సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు తదితర సిబ్బంది పనిచేసేలా నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. ఇలా నియోజకవర్గంలో మొత్తం 48 మంది పనిచేసేశారు. అప్పటి వరకు నిరుద్యోగులుగా ఉన్న వీరికి ఉపాధి లభించడంతో కుటుంబాలు సంతోషంగా గడుపుతుండేవి. అయితే బుధవారం నుంచి వీరిని ఉద్యోగాల నుంచి తొలగించడంతో రోడ్డున పడ్డారు. కూటమి నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి వీరికి ఉపాధి లేకుండా చేసింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరతూ వీరు ఆందోళన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చానా వీరికి ప్రత్యామ్నాయ అవకాశాలు చూపలేదు. నిన్నటి వరకు కడుపునిండా తిండి ఉన్న వీరికి నేడు ఆకలి బాధను అనుభవిస్తున్నారు. ఉపాధి కోల్పోడంతో ఎలా జీవనం సాగించాలనే ఆలోచనలో పడ్డారు.

ప్రత్యామ్నాయం చూపాలి



నూతన మద్యం పాలసీ ప్రకారం తొలగించిన మాకు ప్రత్యామ్నామం చూపించాలి. కొంత కాలం ప్రభుత్వానికి సేవలందించడంతో పాటు ఆదాయ వనరులను కాపాడామన్న దృక్పథంతో చూడాలి. ఉద్యోగాలు కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలవాలి. ప్రభుత్వం మాకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి. – శివ శంకర్, ఆలూరు

ఉపాధి కల్పించండి



మద్యం షాపుల్లో పనిచేసిన మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఈ విషయమై వివిధ సందర్భాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతి పత్రం అందించాం. ప్రస్తుతం కొత్త మద్యం పాలసీ రావడంతో మేం రోడ్డున పడ్డాం. మా కుంటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం మాకు ఉపాధి కల్పించాలి.

– రవి కుమార్,ఆలూరు

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆలూరు రూరల్: కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యారోగ్య సిబ్బంది అవగాహన కలిస్తున్నారు. దోమల ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బంది గురువారం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, డ్రమ్ముల, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉంటే లార్వా వృద్ధి చెంది దోమలు ప్రబలుతాయన్నారు. రోజు విడిచి రోజు జ్వరం వస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. తాగునీటిని కాచి చల్లార్చి వడపోసి తాగాలని చెప్పారు.

పత్తికొండ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా స్వర్ణలత

పత్తికొండ(తుగ్గలి) : మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా స్వర్ణలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న కవిత సెలవులో వెళ్లడంతో మద్దికెర ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా ఉన్న స్వర్ణలతను ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్నతాధికారులు నియమించారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎంపీపీ నారాయణదాసును మర్యాద పూర్వకంగా కలిశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దేవనకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం భ్రూణహత్యలు అనే అంశంపై వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వపు పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ తిమ్మారెడ్డి, హెచ్ఎం వై.మద్దిలేటి తెలిపారు. కుంకనూరు, దేవనకొండ, కరివేముల, గుండ్లకొండ, తెర్నెకల్, కేజీబీవీ, కె.వెంకటాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. తెర్నెకల్ జెడ్పీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం.సాగర్ మొదటి స్థానం, కరివేముల విద్యార్థి సుమయ రెండో స్థానం, దేవనకొండ విద్యార్థి ప్రేమ్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారన్నారు. వక్తృత్వపు పోటీల్లో దేవనకొండ విద్యార్థి ఎం.అఫ్రిన్, తెర్నెకల్ విద్యార్థి ఈ.మహేంద్ర, సుస్మిత వరుస స్థానాల్లో నిలిచారన్నారు. డ్రాయింగ్ పోటీల్లో తెర్నెకల్ విద్యార్థిని డి.శిరీష, తెర్నెకల్ జెడ్పీపాఠశాల విద్యార్థి బి.విజయ్, దేవనకొండ విద్యార్థి చింటు ప్రతిభ చూపారని వివరించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తుగ్గలి : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం చెన్నంపల్లి, రామలింగాయపల్లిలో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, సర్పంచ్ రంగమ్మ, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేశ్వర్లు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ వెంకటపతి, ఏపీఓ హేమసుందర్ భూమి పూజ చేశారు.

కృష్ణగిరి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దొడ్డి, చుంచుఎర్రగుడి, చిట్యాల గ్రామాల్లో గురువారం ఎంపీడీఓ మోహన్‌కుమార్, సర్పంచ్ రాజేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ జాకీర్ హుసేన్, ఏపీఓ నాగ సులోచన, ప్రకాష్, శేఖర్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వెల్దుర్తి మండలంలోని లక్ష్మీనగరం, మదార్‌పురం, సర్పాపురం గ్రామాల్లో ఎంపీడీఓ సుహాసినమ్మ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పనులకు భూమి పూజ చేశారు.

నేటి నుంచి శిక్షణ

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఉప సర్పంచ్‌లు, ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పారిశుద్ధ్యం, వీధి లైట్లు, జీపీడీపీ ప్రణాళికపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు శిక్షణ ఇస్తారని, తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

మద్దికెర : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్ర, శనివారాల్లో మండలంలోని అన్ని పంచాయతీల ఉపసర్పంచులు, ఇద్దరు పంచాయతీ సభ్యులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని ఎంపీడీఓ సీవీ కొండయ్య గురువారం తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు.

అమరవీరుడికి నివాళి



వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ యు.డి.వెంకటేశ్వర్లు విధి నిర్వహణలో భాగంగా 1989 అక్టోబర్ 17న వరంగల్ జిల్లా నార్లాపూర్ అడవుల్లో కాల్వపల్లి చేపట్టిన కూంబింగ్‌లో నక్సల్స్‌కు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందాడు. ఈయన 35వ వర్ధంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

21న మెగా జాబ్‌మేళా

ఆదోని అర్బన్: స్థానిక డా.జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో ఈనెల 21వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ మురళీబాబు గురువారం తెలిపారు. ఇందులో 35 ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొంటాయని, 16 వేలకు పైగా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంఎస్సీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, ఎంటెక్, ఎంకామ్, ఎంఏ తదితర కోర్సులు పూర్తి చేసిన పాల్గొనవచ్చన్నారు. వయస్సు 18 –30 సంవత్సరాల్లోపు ఉండాలని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. వివరాలకు 9866278735, 9100487482, 9492901222 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

కార్తీకదీపోత్సవం ప్రారంభం



దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠంలో కార్తీక దీపోత్సవం వేడుక అట్టహాసంగా ప్రారంభమైంది. చంద్రమానం పంచాంగం మేరకు కార్తీకమాసం ఈ పౌర్ణమి నుంచి మొదలవుతోంది. అయితే మంత్రాలయంలో 15 రోజులు ముందుగానే దీపోత్సవం ప్రారంభించడం ఆనవాయితీ. గురువారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఊంజల మండపంలో రాఘవేంద్రుల బృందావన ప్రతిమకు విశేష పూజలు గావించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య కార్తీక దీపాన్ని వెలిగించి పూజలను ప్రారంభించారు.

దంచి కొట్టిన వాన

మద్దికెర : మండలంలోని గురువారం సాయంత్రం వాన దంచి కొట్టడంతో పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పొలాలు కుంటలను తలపించాయి. బసినేపల్లి గ్రామానికి చెందిన గుంతా దోవిందు, దేవేంద్రప్ప, కుమారప్ప రైతులకు చెందిన పొలాలల్లో నీరు నిలిచి వేరుశనగ పైరు మునిగిపోయిందని వాపోయారు. అలాగే మద్దికెరకు చెందిన రామాంజులు రైతుకు చెందిన ఉల్లి పంట తడిసిపోయింది. మండలంలో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షపాతం 16.9 మీ.మీ నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చిప్పగిరి:మండలంలో గురువారం కురిసిన మోస్తరు వర్షానికి మడలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండల కేంద్రంతోపాటు బంటణహాలు, నేమకల్లు, గుమ్మనూరు, నగరడోణ, ఏరూరు, రామదుర్గం,బెల్డోణ, నంచర్ల తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. పలు గ్రామాల్లో పత్తి,కొర్ర,సజ్జ,కంది,మిరప తదితర పంట పొలాల్లో వర్షపునీరు నిలిచిపోయింది.

తుగ్గలి : తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి గురువారం వేకువజామున మండలంలోని పీ.కొత్తూరు గ్రామంలో శ్రీరాములుకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. వర్షానికి తడిసి ఇంటి పైకప్పు కుంగిపోయింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.



ఉల్లి పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

కృష్ణగిరి: గురువారం తెల్లవారుజామున కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు పంట ఉత్పత్తులు పొలాల్లోనే నిలిచిపోయాయి. ఈ వర్షం కొన్ని పంటలకు మేలు కాగా మరి కొన్ని పంటలకు నష్టం చేకూరే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణగిరి మండలంలో 49.2 మీ.మీ, వెల్దుర్తి మండలంలో 51.0 మీ, మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. కృష్ణగిరి నుంచి వెల్దుర్తికి వచ్చే ప్రధాన రహదారిలో పుట్లూరు మారెమ్మ మండపం సమీపంలో రహదారిపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహించాయి. అలాగే కంబాలపాడు నుంచి కోయిలకొండకు వెళ్లే దారిలోని వంక కూడా బ్రిడ్జిపై ప్రవహించింది.



మద్దకెర: తడిసిన ఉల్లి పంటను ఆరబోసిన దృశ్యం



కుందనగుర్తి సమీపంలో మిరప పైరులో నిలిచిన వర్షపు నీరు





పీ.కొత్తూరులో కూలిపోయిన మట్టిమిద్దె, కోయిలకొండ-కంబాలపాడు గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

రైతులను ఆదుకోవాలి

హొళగుంద: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఐ, రైతు సంఘం మండల కార్యదర్శులు పెద్యాట మారెప్ప, కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం సుళువాయి, పెద్దహ్యాట రోడ్డులో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ, మిరప, తదితర పంటలు అధిక వర్షాలకు కుళ్లిపోయాయని, కొన్నిచోట్ల వర్షపు నీటిలో కొట్టుకుపోయాయన్నారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

అనారోగ్యంతో గ్రామ సేవకుడు మృతి

కృష్ణగిరి: మండలంలోని కోయిలకొండ గ్రామానికి చెందిన గ్రామ సేవకుడు నబీసాహెబ్ (56) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వీఆర్వోలు మద్దిలేటి, అయ్యన్న గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. రెవెన్యూ కార్యాలయం తరపున కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

నేటి నుంచి గ్రామసభలు

హాలహర్వి: రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రీ సర్వే ముగిసిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తహసీల్దార్ నజ్మాబాను గురువారం తెలిపారు. మండలంలో రీ సర్వే ముగిసిన ఐదు గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామసభలు ఉంటాయన్నారు. ఈనెల 18న కుర్లేహల్లి, 19న మాచనూరు, 22న కొక్కరచేడు, 23న శ్రీధర హాల్, 24న నిట్రవట్టి గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు.

మద్దికెర : మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ తెలిపారు. గురువారం స్థానిక తన కార్యాలయంలో సర్వేయర్, వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ముందుగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయన మాట్లాడుతూ 18న ఎం.అగ్రహారం, 19న బురుజుల, 22న హంప గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. భూయజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. డీటీ శ్రీదేవి, వీఆర్వోలు రషీద్, శివన్న, స్వర్ణమ్మ, సర్వేయర్ భూపేంద్ర పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలో రీసర్వే పూర్తైన గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహించునున్నట్లు తహసీల్దార్ శివశంకర్ నాయక్ తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రీసర్వే తహసీల్దార్ భీమేష్, డీటీ రమేష్‌రెడ్డి, వీఆర్‌ఓలతో రీసర్వేపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన శంకరబండ, 19న తురువగల్లు, 22న బిణిగేరి, 23న బనవనూరు, 24న చిరుమాన్‌దొడ్డి, 25న చిగిళి, 26న కారుమంచి, 29న ముత్తుకూరు లో గ్రామ సభలు నిర్వహించునున్నట్లు చెప్పారు.

మినీ ట్యాంకులు ప్రారంభం

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో శ్మశాన వాటిక, బీసీ కాలనీలో రూ.3.50 లక్షలతో నిర్మించిన పైపు లైన్, మంచి నీటి మినీ ట్యాంకులను సర్పంచ్ లింగమ్మ గురువారం ప్రారంభించారు. దీంతో కాలనీ వాసులకు నీటి సమస్య పరిష్కారమైందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచానికి జీవన మార్గం రామాయణం

- ఘనంగా వాల్మీకి జయంతి

పత్తికొండ(తుగ్గలి) : ఆదికవి మహర్షి వాల్మీకి భారత దేశానికే కాకుండా యావత్ ప్రపంచానికే ఆదర్శప్రాయుడని, జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహనీయుడని కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులు అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని పాతపేటలో వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ కొమ్ము దీపిక, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆదికవిగా.. మహర్షి

ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి

రామాయణ మహాకావ్యం ప్రపంచానికి జీవన మార్గంగా నిలుస్తోందని, ఆ గ్రంథాన్ని రచించిన వాల్మీకి ఆదికవిగా కీర్తించబడుతున్నారని ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. పత్తికొండలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. గుడిసె కృష్ణమ్మ, మద్దిలేటి, వాల్మీకులు పాల్గొన్నారు.

తుగ్గలి : మండలంలోని పగిడిరాయి, తుగ్గలి, రాతన, జొన్నగిరి గ్రామాల్లో వాల్మీకి జయంతిని వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. పగిడిరాయిలో వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుంరాజు వెంకటేష్ అన్నదానం ఏర్పాటు చేశారు.



ఆలూరులో వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

ఆలూరు రూరల్: వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని వక్తలు అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గోవింద్ సింగ్ సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు.

ఆస్పరి: మండలంలోని బిణిగేరి, హలిగేర గ్రామాల్లో వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. ఆస్పరి, హలిగేర, బిణిగేరి గ్రామాలలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు.

మద్దికెర : వాల్మీకి మహర్షి జీవితం మానవాళికి ఆదర్శమని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శాంతన్న, వాల్మీకి సంఘం నాయకులు స్టోర్ రాముడు, తలారి సుంకన్న, గుడికాటి రామాంజులు, యాటగారి బాలు, గురుపాదం అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహాన్ని ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం వాల్మీకి చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

ఆలూరు: మహర్షి వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. గురువారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలోనున్న వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం పురవీధుల్లో మహర్షి చిత్రపటాన్ని ఊరేగించారు.



పత్తికొండలో వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న ఎస్ రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ దంపతులు

హొళగుంద: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానాలు చేసి పంపినా కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదని, ఇప్పుడైనా స్పందించాలని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి కోరారు. గురువారం మండల కేంద్రంతో పాటు వందవాగిలి, ఎల్లార్తి, పెద్దహ్యాట, కోగిలతోట, సుళువాయి తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హొళగుందలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మహర్షి విగ్రహానికి పూజలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని డిమాండ్ చేశారు.

కృష్ణగిరి: రామాయణ మహా కావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి మహోన్నతుడని మాజీ సర్పంచ్‌లు నాగన్న, గంగప్ప, శంకరయ్య అన్నారు. మండలంలోని కోయిలకొండ గ్రామంలో వాల్మీకి జయంతిని సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.



పత్తికొండలో ర్యాలీలో పాల్గొన్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి



తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ గోవింద్ సింగ్

- వెల్దుర్తి మండలంలో

వెల్దుర్తి పట్టణంలోని పాత బస్టాండ్‌లోని వాల్మీకి విగ్రహం వద్ద గురువారం మండల వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సంఘం మండల అధ్యక్షులు గోపినాథ్ నాయుడు, రామచంద్ర నాయుడు, వెంకట్ నాయుడు, బోయపాటి శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.